# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **రెపో రేటును 5.5 శాతం వద్దే ఉంచాలని నిర్ణయించినట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు.**

**2.** **అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం కొనసాగుతోంది.**

**3.** **రాజధానికి భూములిచ్చిన రైతుల సమస్యలను పరిష్కరిస్తామని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు.**

**4.** **రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.**

**5.** **దేశవ్యాప్తంగా ఐక్యతా భావనను పెంపొందించేందుకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు.**

==========================

రెపో రేటును 5.5 శాతం వద్దే ఉంచాలని నిర్ణయించినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంకు-ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ముంబైలో ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆయన ఈ రోజు పాత్రికేయులకు వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధి రేటు 6.5శాతంగా నమోదైయ్యే అవకాశం ఉందని తెలిపారు. ద్రవ్యోల్బణం తగ్గినప్పటికీ.. ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు ఇంకా తొలగలేదని అందువల్ల రెపో రేటును యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు సంజయ్ మల్హోత్రా తెలుపుతూ,

వాయిస్ 29 సెకన్లు

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తున్నారు. స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఈనెల 15 నుంచి రాష్ట్రమంతటా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి మంత్రి వర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే ఏపీ ల్యాండ్ ఇనిషియేటివ్స్ అండ్ టెక్ హబ్స్-లిఫ్ట్ విధానం 2024-29పై మంత్రివర్గం చర్చించనుంది.

---------------------------

రాజధానికి భూములిచ్చిన రైతుల సమస్యలను పరిష్కరిస్తామని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. విజయవాడలోని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సీఆర్డీఏ కార్యాలయంలో మంత్రి నారాయణతో అమరావతి రైతు సంఘాల నాయకులు నిన్న సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రైతులు తెలిపిన 14 అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, కొండవీటి వాగు, పాల వాగు, గ్రావిటీ కెనాల్ పనులు వేగవంతం చేయనున్నామని తెలిపారు. రాజధాని ప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

పశ్చిమగోదావరి జిల్లాలోని పాలకొల్లు అభివృద్ధికి 79 కోట్ల రూపాయలను కేటాయించామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రధానంగా గోదావరి లంక గ్రామాలైన పెదలంక, కనకాయలంక వద్ద వంతెన నిర్మాణానికి 24 కోట్ల రూపాయలు, గోదావరి తీర గ్రామాలను కలుపుతూ ఏటిగట్టుపై గ్రావెల్ రహదారి నిర్మాణానికి నాలుగు కోట్ల రూపాయలు కేటాయించామని తెలిపారు. వీటితో పాటు మురుగు నీటి వ్యవస్థ, కచ్చా రహదారుల నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి వివరించారు.

---------------------------

ప్రజా పంపిణీ వ్యవస్థ–పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బియ్యం అక్రమ రవాణాపై విశాఖపట్నం పోర్ట్, కస్టమ్స్ అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా అందించే బియ్యాన్ని అవసరాల కోసం వినియోగించాలని విక్రయించకూడదని తెలిపారు. అక్రమ రవాణాను ప్రణాళికాబద్ధంగా అడ్డుకోవాలని, సరిహద్దులు, పోర్టులు, రవాణా మార్గాల వద్ద పటిష్ట తనిఖీలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలలో నాణ్యమైన ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని ఆయన ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి వసతులను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్.. 26 సెకన్లు

---------------------------

దేశవ్యాప్తంగా ఐక్యతా భావనను, దేశ భక్తిని పెంపొందించేందుకు “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇళ్ళలో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసి సంబంధిత సెల్ఫీలను www.harghartiranga.

com వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయడం, తిరంగా బైక్ ర్యాలీలు, విద్యార్థులకు తిరంగా రంగోలి, తిరంగా రాఖీ తయారీ వంటి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. ప్రతి భారతీయునిలో దేశ భక్తి భావనను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 61 పాయింట్ల నష్టంతో 80 వేల 648 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 41 పాయింట్ల నష్టంతో 24 వేల 610 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

ఉపరితల ఆవర్తనం, నైరుతి బంగాళాఖాతం ఉత్తర తమిళనాడు తీరం వెంబడి సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ....

వాయిస్...33 సెకన్లు

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో వర్షపునీరు ఒడిసిపట్టడం "క్యాచ్ ది రైన్" అనే కార్యక్రమాన్ని చేపట్టింది. "ప్రజా అవగాహన దిశగా నీటి సేకరణలో ప్రజల భాగస్వామ్యం" అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా 148 జిల్లాలలో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వాతావరణ మార్పుల ద్వారా పెరుగుతున్న నీటి కొరత నేపథ్యంలో నీటి భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

======================